
# సద్యోగం...

-ద్వివేదుల సోమనాథశాస్త్రి



**అప్పుడే షాపు తెరచి దినపత్రిక చదువుతూ కూర్చున్నాను. ఇంకా స్కూళ్లకూ, కాలేజీలకూ వేళ కాలేదు. అందుకే పుస్తకాల కోసం పిల్లల సందడి ఇంకా మొదలుకాలేదు.**

**" 'కళాపూర్ణోదయం' ఉందాండీ?" పేపరు చదువుతున్న నేను ఆ ప్రశ్నకు ఉలిక్కిపడి ఆ వ్యక్తి వంక చూశాను. తేలికపాటి రచనలు చదవడం అలవాటయిన రోజుల్లో 'కళాపూర్ణోదయం' అడిగేది ఎవరు చెప్మా? అనేదే నా ఆశ్చర్యానికి కారణం.**

ఎదురుగా కనిపించిన వ్యక్తికి రమారమి నలభై ఏళ్లుంటాయి. ఆడంబరంగా లేకపోయినా పెద్ద ఉద్యోగస్తునిలాగే ఉన్నాడు. ముఖ్యంగా అతన్ని ఎక్కడో చూసినట్టు కనిపించింది. అనిపించడం ఏమిటి? గప్పున పోల్చుకున్నాను. అయితే అతను నన్ను గుర్తుపట్టలేదు. కాని నేను మరచిపోగలనా? ఈ రోజు నేను ఒక బుక్‌షాపు యజమానిగా, ప్రముఖ ప్రచురణకర్తగా పేరు తెచ్చుకుని లక్షాధికారి కాగలిగానంటే అదంతా అతని ప్రభావమే !

"మీరు... మీరు... ప్రభాకరరావుగారే కదూ?" అని అడిగేను.

"అవును. మీకెలా తెలుసు?" ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"రండి. దయచేసి లోనికి వచ్చి కూర్చోండి." ఆహ్వానించాను.

"థాంక్యూ" అంటూ వచ్చి కూర్చున్నాడు.

"మీరు నన్ను బొత్తిగా మరచిపోయినట్టున్నారే! ఇంకా గుర్తుకు రాలేదా?" అన్నాను.

"ఊహూఁ! నాకు జ్ఞాపకం రావడం లేదు, క్షమించాలి!" గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ చెప్పాడు.

"పన్నెండేళ్ల క్రిందటి మాట. మీరు ఒక బ్యాంకు టెస్టుకి వచ్చారు కదూ!" గుర్తు చేస్తూ అడిగాను.

"అవును!"

"ఆ టెస్టులో మీరు రాస్తుంటే మధ్యలో మీ దగ్గరకు వచ్చి ఒక స్పేర్‌పెన్ ఇమ్మని అడిగాను, జ్ఞాపకం వచ్చిందా?" అని గుర్తు చేశాను.

"ఓ! అవునండి. ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. ఆనాడు మీ పెన్ను పాళీ విరిగిపోయిందని అడిగారు... మీరేనా? చాలా సంతోషమండీ. చాలా రోజులకు ఇలా కలుసుకున్నాం."

"మీరు ఇప్పుడేం చేస్తున్నారు?" అని అడగబోయి అర్ధోక్తిలో ఆగిపోయాను. వెంటనే ఆయనే అందుకున్నాడు.

"ఆ బ్యాంకులోనే ఇప్పుడు నేను మేనేజర్‌ను. ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అయింది. వచ్చి వారం రోజులు అయింది" అని చెప్పాడు.

"అలాగా చాలా సంతోషం. నా గురించి అర్థమయ్యే ఉండాలి మీకు. ఇలా ఉన్నాను" అని అంటూ 'కళాపూర్ణోదయం' తీసి ఇచ్చాను.

అది తీసుకుని "మంచిది. మళ్లీ కలుద్దాం" అని అంటూ వెళ్లిపోయాడు.

అలా వెళ్లిపోతున్న అతన్ని చూస్తూంటే నాకు గతం అంతా కళ్లముంధు కదలాడింది.

"నేను డిగ్రీ పాసయిన రోజుల్లో కూడా ఇప్పటి లాగే ఉద్యోగాలు దొరకడం కష్టంగా వుండేది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్త. ఇంకా ఏ రంగంలోనూ స్థిరపడని కాలం. అభివృద్ధి అంతా ప్రణాళికల రూపంలోనే వుంది.

డిగ్రీ అంటే వచ్చేసింది గాని, ఉద్యోగం రావొద్దూ! ఎక్కడ ప్రకటన కనబడినా, దానికి దరఖాస్తు పెట్టుకోడం, పరీక్షలకు వెళుతూండడం... తిరిగి వచ్చేయడం... అంతే... నౌకిరీ మాత్రం దొరికేది కాదు.

చాలా మంది బాగా చదువుకున్న వాళ్లే— సినిమా హాల్లో బుకింగ్ క్లర్కులుగా, మందుల షాపుల్లో సెల్లర్

## పరీక్ష

విద్యార్థులతో మాస్టారు సీరియస్‌గా అన్నారు "రేపే పరీక్ష అన్నంత పట్టుదలగా ప్రతి రోజు చదవాలి మీరు..."

"అయితే ప్రిపరేషన్ హాలిడేస్ తీసుకోమంటారా మాస్టారూ!"

"....?"

భూక్యా గోపీనాయక్, చిలకలూరిపేట

---

కమ్ క్లర్కులుగా మరికొందరూ ఆఫీసుల్లో క్లాస్ ఫోర్ ఉద్యోగాలూ చేస్తుండే వారు.

అలాటి వాళ్లను చూస్తే నాకు ఒళ్లు మండేది, చదువుకొని డిగ్రీకి తగ్గ ఉద్యోగం చేయకుండా— అలా కక్కుర్తి పడి దిగజారిపోవడం కంటే ఏ పనీ చేయకపోవడం మంచిది అని అనుకొనే వాడిని, అంతేకాకుండా అలాంటి వారిని చిన్నచూపు చూస్తూ హేళన కూడా చేసే వాడిని.

కాని వాళ్లెందుకలా ఆ చిన్న ఉద్యోగాలు చేస్తున్నారో, వాళ్ల బాధ్యత ఎటువంటిదో ఊహించలేక పోయే వాడిని.

ఎందరో ఇంజనీరింగ్ పాసయి, ఉద్యోగాలు లేక మెయిన్ రోడ్‌లో చెరుకు పానకం అమ్ముకున్నారంటే—

కొందరు 'లా' పాసయి, ప్రాక్టీసు లేక, ఇన్సూరెన్స్ ఏజన్సీ తీసుకుని ఆ గుమ్మం, ఈ గుమ్మం తిరుగుతున్నారంటే—

మరికొందరు డాక్టర్లు ప్రాక్టీసులేక మందుల ఏజంట్లుగా మారుతున్నారంటే.

"ఎం.ఏ" ఫస్ట్ క్లాసులో పాసయి ఉద్యోగాలు లేక ట్యూషన్లు చెప్పుకుంటున్నారంటే— ఇలా ఎందరో బాగా చదువుకున్నా గత్యంతరం లేని స్థితిలో ఏ దుకాణంలోనో పద్దులు రాసుకుంటున్నారంటే—

ఆ మాత్రం కూడా దొరకని వాళ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే— ఆ వెనక ఎంతటి బీదరికం, ఎంతటి బాధ్యత వుందో నాకపుడు అర్థం కాలేదు... అసలు అలాంటి వాళ్లు చదువుకున్న వారేనా అనిపించేది— అలా ఆలోచించే నేను ఎన్నో ఇంటర్వ్యూలకు వెళ్లేవాడిని... ఎంతో ఇబ్బందిపడే వాడిని, అప్పుడప్పుడు చేతిలో ఖర్చుకు లేక చాలా కష్టం అనిపించేది! ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి తిరిగి కాస్త టీ త్రాగుదామన్నా ఉండేది కాదు. యింటికి వస్తే టైముకాని టైము కాస్త అన్నం వుండేది... అంతే...

రోజులు గడుస్తున్న కొద్దీ యింట్లో వాళ్లు సూటిపోటి మాటలు మొదలయ్యాయి. "ఉద్యోగం, సద్యోగం లేకుండా పోరంబోకులా వుంటున్నానని— సిగ్గులేదని — నాతోటి వాళ్లు ఏదో ఒకటి చేసుకుంటూ సాయం చేస్తున్నారని..." యిలా రకరకాలుగా అనే వారు.

అయినా సరే మౌనంగా అన్నిటికీ తలవంచే వాడినే గాని, అలాంటి పరువు తక్కువ పనులు చేయడానికి, మనస్కరించేది కాదు.

ఆ రోజున బ్యాంక్ టెస్ట్—

ఉన్నంతలో మంచి బట్టలు వేసుకొని పరీక్షకు వెళ్లాను — పది పోస్టులకు నాలుగు వందల మంది పరీక్ష రాయడానికి వచ్చారు ! హాలు బయట నాలాటి వాళ్లే చాలా మంది వున్నారు.

అప్పటికింకా టైము కాలేదు. కొందరు బెంచీల మీద మరి కొందరు మెట్లమీద కూర్చున్నారు. స్తంభాలకు చేరబడి సిగరెట్లు కాల్చేవారు కొందరయితే ఇంకొందరు గుంపులుగా చేరి బాతాఖానీ చేస్తున్నారు. బుద్ధిమంతులు జనరల్ నాలెడ్జి పుస్తకాలూ, ఇయర్‌బుక్ పుస్తకాలూ, బ్యాంక్ టెస్ట్ పుస్తకాలూ, ఇలాంటివి లాస్ట్‌మినిట్‌లో కూడా బట్టీ పెడుతున్నారు!

కొందరు ఎవరితో మాట్లాడకుండా విచారంగా కూర్చున్నారు! కొందరు పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో అని చర్చించుకుంటున్నారు. ఇలా కోలాహలంగా ఉంది; ఇంతలో—

"పెన్నులు సార్! పెన్నులు! ఇంకు పొయ్యమంటారా? పెన్ను కావాలా? పాళీలు కూడా ఉన్నాయి. కావాలా సార్!..." అని ఒకతను అమ్ముతున్నాడు. ప్రతీ వాళ్ల దగ్గరా వచ్చి—వద్దనో, కావాలనో, ఏదో ఒకటి చెప్పే వరకూ నిలబడి అడుగుతున్నాడు.

అతడిని చూస్తే చదువుకున్న వాడి లాగనే ఉన్నాడు. కొందరు వద్దని అంటున్నా—కొనేవాళ్ళు కొంటున్నారు. నా దగ్గరకు వచ్చాడు.

"ఇంకు చూసుకున్నారా సార్! పరీక్ష మధ్యలో సమయానికి ఈ పెన్నులు చికాకు పెడతాయి. పరీక్షకు వెళుతున్నారు కదా స్పేర్ పెన్ ఒకటి ఉంచండి. ఎందుకయినా మంచిది!.. చాలా చీప్! ఒక్క రూపాయ్ సార్! ఉంచండి!" అన్నాడు.

"వద్దు బాబు!" అన్నాను. అక్కడినుండి కదిలిపోతూ.

"అలాగనకండి సార్. పోనీ పాళీ చూసుకున్నారా? బాగుందో లేదో పోనీ ఇంకు పోయించుకోండి... ఒక్క పావలా సార్!" అని వెంటబడ్డాడు!

"వద్దంటే నీక్కాదూ! నాకు పెన్ను ఉంది— అందులో ఇంకూ ఉంది!... నాకేం అక్కర్లేదు. నన్ను వదులు!" అని విసుక్కున్నాను.

"చూడండి పరీక్ష రాస్తూంటే మధ్యలో పాళీ విరిగిపోవచ్చు— స్పేర్ నిబ్ ఒకటి ఉంచండి! ఒక్క పావలాయే సార్!" అని నసిగాడు.

"శుభమా! అని పరీక్షకు వెళుతూంటే నీ అపశకునం మాటలేమిటీ. అసలు చదువుకున్న వాడిలా ఉన్నావు!... నీ కిదేం ఖర్మా! ఎక్కడయినా ఉద్యోగం చేసుకోకూడదూ! ఈ ముష్టి వెధవ వ్యాపారం చేయకపోతేనేం? దీనితో కడుపు నిండాలా? లాభం రావాలా?" అని కసిరేసేను.

అతను ఏమనుకున్నాడోగాని— నవ్వుతూ—

"అలాగనకండి సార్! ఉత్తినే కూర్చొనే కన్నా ఏదో ఒకటి చేసుకుంటే మంచిది కాదా! నా అంతటి వాడిని నేను అయినాక— కనీసం నా జేబు ఖర్చుకయినా తల్లిదండ్రుల మీద ఆధారపడ నక్కర్లేదు కదా!" అని అంటూ ఇక నన్ను విసిగించ కుండా మరొకరి దగ్గరికి వెళ్ళిపోయాడు.

"అబ్బో వీడెవడో మాటలు నేర్చిన వ్యాపారి! ఇంకొంచెం ఉంటే మాటలే అమ్మేట్టున్నాడు" అని అనుకున్నాను.

సరిగ్గా పది అయింది— అందరం హాల్లోకి వెళ్ళి కూర్చున్నాం—

పదిన్నర కల్లా పేపర్లిచ్చారు— ఆ పేపరు చూసి కొందరు ముఖాలు వెలిగి పోతూంటే కొందరివి వాడిపోతున్నాయి. కొందరు మొదలెట్టిన కలం ఆపకుండా దించిన తల ఎత్తకుండా పేజీలకి పేజీలు రాసేస్తున్నారు! కొందరు దిక్కు తోచక దిక్కులు చూస్తున్నారు. కొందరు ఏమి రాయక పోతే బాగుండదని, ఏదో గెస్ కొట్టి అయితే అయింది లేక పోతే లేదని రాస్తున్నారు!

ఇహ నా సంగతి ! అటూ ఇటూ కాకుండా...వుంది ! అన్ని వచ్చినట్టే వచ్చిన వేవో ముందుగా రాయడానికి సిద్ధపడ్డాను !

అరగంట అయింది. పెన్ను టేబిల్‌మీద వుంచి, రుమాలుతో ముఖం తుడుచుకోబోయేసరికి చేయి తగిలి పెన్ను కింద పడింది... తీసి చూద్దును పెన్ను పాళీ కాస్త... విరిగి పోయింది !

ఏమిటీ అపశకునం ! ఏ పరీక్షకూ యిలాగవలేదే !... యిప్పుడేం చేయడం? ఏవో వచిన వయినా బాగా రాస్తే... మిగతావాటికి కొన్ని పాయింట్లే నా రాస్తే పాస్ అయ్యే అవకాశం వుంది !... కాని యిప్పుడెలా? పెన్ను లేదే? ఎలా రాయడం?

అప్పుడు జ్ఞాపకం వచ్చేడు... ఆ పెన్నులమ్మే కుర్రవాడు... మంచికో చెడుకో ! వాడు అంటూనే వున్నాడు. ఒక స్పేరు పెన్ను వుంచండి ఎందుకయినా మంచిది" అని కాని చెవిని పెడితేనా? వాడిని అసహ్యించుకొని, విదిలించుకొని వెళ్లిపోయాను. కాని అతని మాటలు విని అప్పుడే ఒక పెన్నో, పాళీయో ! కొని వుంచుకొంటే యిప్పుడీ గతి పట్టేదికాదు కదా ! అని ఆలోచిస్తూ...

ఏమీ పాలుపోక, ఎవరి దగ్గరయినా స్పేర్ పెన్ను వుంటుందేమోనని చుట్టూ చూశాను !

ఆశ్చర్యం ! !

నా ఎదురు బెంచీలో— వంచిన తల ఎత్తకుండా దీక్షగా రాస్తున్న ఆ పెన్ను లమ్మిన కుర్రవాడు... నా కళ్లను నేనే నమ్మలేకపోయినాను ! కాని... అతనే !...అతనే !

"...సార్ ! పెన్నులు కావాలా సార్ !... వెరీ చీప్ ! ఒక పాళీ...స్పేర్ పాళీ... వుంచండి సార్... ఇంకు పోయించుకోండి సార్ !..." ఈ మాటలు గింగిరుమంటున్నాయి ఆపద్బాంధవుడిలా కనబడ్డాడు... లేచి వెళ్లేను.

"ఏమండీ..."

తల ఎత్తి చూశాడు...

"ఎక్స్యూజ్ మీ... మీ బిజినెస్ బేగ్ తేలేదా?... ఒక పెను స్పేర్ చేయగలరా? నా పెన్ను క్రిందపడి... పాళీ విరిగిపోయింది !..." అని ఎంతో సిగ్గుతో అన్నాను !

"బేగ్ తేనివ్వరు కదాండీ... అయినా ఫర్వాలేదు... నా జేబులో కొన్ని ఎప్పటి కేం అవుసరమో అని కొన్ని వుంచుతాను... ఒకటి తీసుకోండి... "విష్ యు గుడ్ లక్" అంటూ తీసి యిచ్చేడు !

"తేంక్స్ చెప్పి కృతజ్ఞతతో తీసుకొని, నాకు తోచింది రాసి వచ్చేశాను. నేను వచ్చిన అరగంట తర్వాత పరీక్ష ముగించి అతను వచ్చేడు.

కనీసం అతనికి మాట మాత్రమయినా కృతజ్ఞత చెప్పాలని నేను వేచివున్నాను.

"మీ ఉపకారం మరచిపోలేను. వెరీ మేనీ తేంక్స్ !"

అన్నాను అతడు రాగానే.

"దానికేం లెండి ! ఎప్పుడే అవుసరం వస్తుందో? ఎవరు చెప్పగలరు?" సరే...దానికేం లెండి ! పేపరు బాగా అన్సరు చేశారు కదా !" అని అడిగేడు.

"ఏదో...ఓ మాదిరిగా...వ్రాసేను లెండి !... అని అంటూనే—

"మిమ్మల్ని... అర్థం చేసుకోలేక నేను ఏమిటేమిటో అనేశాను... క్షమించండి !" అన్నాను సిగ్గుపడుతూ—

"ఎప్పుడూ?...ఓహో ! "పెన్నులు అమ్ముతున్నపుడా?... నో...నో...నెవర్ అని చాలా ఈజీగా అనేశాడు.

"ఈ టెస్ట్‌కు మీరు కూడా వచ్చి — యిలా బైట పెన్నులు అమ్ముతారని వూహించ లేకపోయాను! ఏదో మామ్మూలు అమ్మకం కుర్రాడనే అనుకున్నాను. అవునూ?... మీరు ఎంత వరకూ చదివారు?" నా కెందుకో అతని గురించి తెలుసుకోవాలని అనిపించింది. "నా పేరు ప్రభాకర్... నేను బి.కాం. పాసయినాను.. ఉద్యోగం కోసం అందరిలాగే ఈ పోస్ట్‌కు అప్లయి చేశాను. నాకూ కాల్ వచ్చింది.. వచ్చి రాసేను.. అంతే మరేం లేదు!" అన్నాడు చాలాసింపుల్‌గా.

"మరి డిగ్రీ చదివి... మీరిలా పెన్నులు... అమ్మడం... నాకు ఆశ్చర్యంగా వుంది".

"ఇందులో వింతే ముందండి ?... ఇంత వయసు వచ్చాక ఇంకా ఒకరికి భారంగా వుండే కంటే — ఉత్తినే కూర్చొనే కన్నా... ఏదో ఒకటి చేసుకుంటే మంచిది కదా?... ఏమంటారు?" అని ప్రశ్నించాడు.

ఆ మాటలు విన్నాకనాకు చెళ్లని చెంపమీద కొట్టినట్టయింది. కాని అందులో ఎంత నిజం ఉందో నాకు అవసరం లేకపోయింది.

"అయితే మాత్రం.. పరువూ... మర్యాదా... అక్కర్లేదా... ఏది పడితే అది చేయడం మంచిదంటారా?" అని తెలివి తక్కువగా అడిగాను.

"అందులో తప్పే ముందండి? ఇది మాత్రం ఒక బ్రతుకు తెరువుకాదా? దొంగతనం, ముష్టి, ఈ రెండూ చేస్తే తప్పు, అంతేగాని, ఇలా ఎవరూ వేలెత్తి చూపలేని పని చేసి కష్టపడి సంపాదించడంలో అవమానం ఏముంది! — చూడండి... ఇలా నేను ప్రతీ పరీక్షల దగ్గరా, పెన్నులు, పాళీలు, ఇంకూ ఇలా ఆ సమయానికి అవసరం వచ్చేవి అమ్ముతూనే —— రోజుకు అయిదారు రూపాయిల వరకూ సంపాదిస్తున్నాను... నా ఖర్చుకి పోగా ఇంట్లో ఒక వంద ఇవ్వగలుగుతున్నాను!. నాకు చదువుకు తగిన ఉద్యోగమే కావాలి! అని కూర్చుంటే... ఎలాగవుతుంది? — ఏదో ఒకటి. చిన్నదో, పెద్దదో, మర్యాదగా చేసుకుంటే — ఎవరేమనుకుంటే నాకేమి? నాకు నా పనిలో తృప్తి, ఆనందం, స్వతంత్రం.. ఉంది?" అని ఒక నమ్మకంతో చెప్పేడు.

అంతా విని — "మీరు చెప్పినది మంచిది కాదన లేను గాని — మీతో ఏకీభవించలేకపోతున్నాను." అని అన్నాను అది విన్న అతను ఆశ్చర్యపోతూ.

"బహుశా మీకు బాధ్యత లేవీ లేవనుకుంటాను — లేకపోతే మీకు ఉద్యోగం ఒక హాబీగా నయినా ఉండాలి! " అని అన్నాడు.

అని విని ఒక్క నిట్టూర్పు విడిచాను.. తర్వాత అతను వెళ్లిపోయాడు. అప్పటి నుండి అతని ప్రభావం నాలో



**ఏం చేస్తావ్?**

"ఏమయ్యా, ఇలా రాత్రంతా అడుక్కు తింటావు సరే... మరి పగలేం చేస్తావ్?"

"వీడియో చూస్తూ కాలక్షేపం చేస్తాను తల్లీ!"

— భూక్యా గోపీనాయక్, చిలకలూరి పేట

— నాకుతెలియకుండానే పనిచేయడం మొదలెట్టింది — ఆ బేంకు టెస్టులో నాకు ఛాన్సు రాలేదు. తర్వాత ఎన్నెన్నో ఆఫీసులు తిరిగాను గాని అన్ని చోట్లా "నో వేకెన్సీ" జవాబే!.

ఇంట్లో పరిస్థితి కూడా చాలా మారిపోయింది. మా నాన్నగారు చీటికీ మాటికీ, చీదరించుకొనే వారు! అతని కంటబడితే చాలు — ఏదో ఒక వంకన.

"ఎందుకూ పనికి రారు గాని తిండికి మాత్రం సిద్ధం..!"

"ఎవరిని చూసినా హాయిగా ఏదో ఒక నౌకరీ చేసుకుంటున్నారు.. దేనికయినా తెలివితేటలుండొద్దూ!"

"ఉద్యోగం —— పురుషలక్షణం అన్నారు! అది లేని జన్మ ఎందుకూ?"

"ఒక్కణ్ణీ తెచ్చి — ఎంతని మేపుతాను!"

ఈ విధంగా దెప్పి పొడుస్తూండేవారు. అమ్మకూడా అప్పుడపుడు చికాకు పడుతూనే ఉండేది. నేను ఎదుగుతున్న కొద్దీ.. నాకూ కొంత ఖర్చుకి అవసరం వచ్చేది. కాని ఎక్కడిదీ డబ్బు!.. నాకేం చేయడానికి తోచేది కాదు!

కాని నా చెవుల్లో మాత్రం.. ఆ మిస్టర్ పెన్ తాలూకూ మాటలే వినబడుతూ ఏదో కర్తవ్యాన్ని గుర్తుకు తెస్తూండేవి!

'....దొంగతనం....అడుక్కోవడం....ఈ రెండు పనులు చేస్తే తప్పుగాని... మర్యాదగా ఏ పని చేసి సంపాదించినా ఎందుకవమానం!....ఒకరి మీద ఆదారపడి బరువయ్యే కన్నా ఎంత చిన్న పని చేసినా మన కాళ్ళ మీద మనం నిలబడితే....అదే గౌరవం అదే వ్యక్తిత్వం....'

ఆఖరికి నా గర్వం నన్ను వంచించింది. ఎందుకూ పనికి రాని వాడిగా చేసింది. అందువల్ల దానికి స్వస్తి చెప్పి ఏదో ఓ పని చేయడానికి సిద్ధపడ్డాను. మరి అంత కన్నా గత్యంతరం లేదు. ఉద్యోగం దొరికే వయసు కూడా దాటి పోయింది.

చదువుకున్న తర్వాత ప్రభుత్వ ఉద్యోగమే చేయాలి! అన్న ఆలోచన ఎంత చెడ్డదో గ్రహించాను! 'మనం చదివిన చదువుకు, తాహతుకు, తగ్గ ఉద్యోగమే కాళ్ళ దగ్గరకు వస్తేనే చేస్తాను — అంతేగాని తక్కువ పనులు చేయను'..... అన్న సిద్ధాంతాన్ని విరమించుకున్నాను....

ఒక న్యూస్ పేపర్ ఏజన్సీ తీసుకుని — ఇంటింటికీ సైకిల్ మీద వెళ్ళి ఉదయం, సాయంత్రం పేపర్లు ఇస్తూ ఉండే వాడిని. తెలిసిన వాళ్ళు కనబడి పేపరు అడిగినపుడు కాస్త సిగ్గనిపించినా పట్టించుకోకూడదనుకున్నాను.

నా రోజు వారీ ఖర్చు పోగా ఇంట చిన్న చిన్న ఖర్చులకు సాయపడే వాడిని.

ఒక రోజు ఒక ఇంట్లో పేపరు ఇస్తుంటే అక్కడ ఉన్న ఒక వ్యక్తి

'ఒరే నువ్వట్రా!...ఇదేమిటి? ఆఖరికి పేపర్ బాయ్ పనా చేస్తున్నావు?' అని అడిగాడు.

ఎవరా అని చూసే సరికి — నాతో చదివిన స్నేహితుడు — అతను ఇప్పుడు లెక్చరర్‌గా ఉన్నాడు.....అతని మాటలు విన్న నాకు కోపం వచ్చింది.

'ఏం? తప్పేమిట్రా? ఉద్యోగం అందరికీ దొరుకుతుంది అన్న గ్యారంటీ ఏమిటి?....ఉద్యోగం లేనంత మాత్రంలో ఏదో ఒక పని స్వతంత్రంగా చేసి బ్రతకడంలో చిన్నతనం ఏముంది?' అని ధైర్యంగా సూటిగా అన్నాను.

ఆ జవాబు విని అలాగే చూస్తూ మారు మాట్లాడ లేక పోయాడు.

అప్పుడనిపించింది — నేను చేసే పనిలో గౌరవమే గాని చిన్నతనం ఏ మాత్రం లేదని — నమ్ముకున్న పని ఎలాంటిదయినా 'అది దొంగతనం — భిక్షాటనం కాకపోతే సరి అని'

అప్పుడు దర్జాగా తలఎత్తుకొని సైకిల్ బెల్ వాయిస్తూ వెళ్ళిపోయాను.

తర్వాత ఒక చిన్న కొట్టు తీసుకుని పుస్తకాలు, మేగజైన్లు, నవలలూ, పత్రికలూ తెప్పించి అమ్మడం సాగించాను.

ఆ తర్వాత కాస్త మదుపు పెట్టి — కాలేజీ స్ట్రీట్‌లో బుక్‌షాపు తెరిచాను. కాలేజీ, హైస్కూల్ పుస్తకాలు, జనరల్ స్టేషనరీ, అన్నీ తెప్పించి అమ్మేను. క్రమేణా మంచి లాభాలు వచ్చాయి.

అక్కడ నుంచి నా జాతకం తిరిగింది. మెల్లగా వివిధ ప్రచురణ కర్తల నుంచి పుస్తకాలు తెప్పించి డిస్ట్రిబ్యూటర్నయినాను. ఆ తర్వాత స్వంత ప్రచురణ సంస్థ ప్రారంభించి — దేశంలోనే మంచి పబ్లిషర్‌గా పేరు సంపాదించాను. ఆ మధ్య జరిగిన నేషనల్ బుక్‌ఫేర్‌లో నా సంస్థ నుంచి ప్రచురించిన పుస్తకాలకు, ప్రింటింగ్ లోనూ, గెటప్‌లోనూ అవార్డ్ వచ్చింది.

పెద్ద పెద్ద రచయితల పుస్తకాలను వేస్తున్నాం. ప్రాచీన, నవీన సాహిత్యాన్ని చీప్ ఎడిషన్స్ క్రింద ముద్రించి మంచి సాహిత్యాన్ని పాఠకులకు అందుబాటయిన వెలకు అందించి భాషా సేవ చేస్తున్నాను.

అంత వాడిని ఇంత వాణ్ణిగా ఎలాగయినాను?

ఇదంతా ఆ ప్రభాకర్ గారి చలవే — అతని ప్రభావమే! ఆనాడు అతను నాకు మార్గదర్శి కాకపోతే — నేనింకా ఆనాటి సంకుచిత భావాలతోనే కూపస్థ మండూకంగా 'చదువు ఉద్యోగం కోసమే' అనీ మూర్ఖంగా నమ్మి ఎందుకూ పనికి రాకుండాపోయే వాడిని. దేశంలో ఎంతోమంది నిరుద్యోగుల్లో ఒకడిగా ఒకరిమీద ఆధారపడి బ్రతుకుతూ ఉండేవాడిని.

అందుకే నాకీ కొత్త జీవితం చూపిన ప్రభాకర్‌గారిని ఎన్నాళ్లయినా మరువలేక పోయాను.